సాక్షి గుంటూరు

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



పెద్దింటమ్మకి బోనాల సమర్పణ

అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మకు గురువారం బోనాలు సమర్పించారు. అనంతరం విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.



అంకమ్మతల్లికి కిలో వెండి వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి సత్తెనపల్లికి చెందిన కొప్పరావూరి సాంబ శివరావు, మహాలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విలువ చేసే కిలో వెండిని అందజేశారు.

పింఛన్లు పంపిణీ



రొంపిచర్ల: రొంపిచర్ల, అలవాల గ్రామాల్లో పింఛన్ల పంపిణీ తీరును పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం పరిశీలించారు. పలువురికి పింఛన్ అందించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. మంగళగిరికి చెందిన రేచర్ల జయంత్ పృథ్వీరాజ్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ పీఆర్వో డీవీవీ సత్యనారాయణ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

రాణించిన గుంటూరు జట్టు

- ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ పోటీలు ప్రారంభం
- వెస్ట్ గోదావరి జట్టుపై తొలిరోజు 8 వికెట్లు కోల్పోయి 251 పరుగులు సాధించిన గుంటూరు

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పరిధిలోని నవులూరు టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం నుంచి సీనియర్ డే ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు గుంటూరు-వెస్ట్ గోదావరి జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 90 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 251 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ డి.యశ్వంత్ 4 ఫోర్లతో 50 పరుగులతో అర్ధసెంచరీతో రాణించగా మరో బ్యాట్స్‌మెన్ కె.మహీదీప్ కుమార్ రెండు ఫోర్లతో 42 పరుగులు సాధించాడు. వెస్ట్ గోదావరి బౌలర్ జి.దీపక్ చంద్ 4 వికెట్లు సాధించాడు.

నాలుగు మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు నాలుగు మండలాల్లో వర్షం పడింది. కొల్లిపర మండలంలో 35.2 మిల్లీ మీటర్లు, తుళ్లూరు మండలంలో 18.4 మి.మీ., దుగ్గిరాల మండలంలో 2.8 మి.మీ, తాడేపల్లి మండలంలో 0.4 మి.మీ చొప్పున వర్షం పడింది. సగటున 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

యర్రబాలెం చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య



మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. గురువారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు వయస్సు కల మహిళ చెరువు వెంట వెళ్తూ అకస్మాత్తుగా చెరువు పక్కన చెప్పులు విడిచి అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించి, మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యార్డుకు 41,894 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 41,894 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,795 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,500 నుంచి రూ.18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,905 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

జలజ్జనని పరవళ్లు

- పోటెత్తిన కృష్ణమ్మ వరద
- శ్రీశైలం నింపి సాగర్‌కేసి పరుగులు
- కృష్ణా పశ్చిమడెల్టాలో పంటల సాగుకు భరోసా
- పంట కాలువల్లోకి నీరు

బీడులను ముద్దాడేందుకు 'వరదా'యిని కృష్ణమ్మ ఉరకలు వేస్తోంది. వంపులు తిరుగుతూ జలాశయాల వైపు పరుగులు తీస్తోంది. బిడ్డల దాహార్తి తీర్చేందుకు తహతహలాడుతోంది. 'జల'జ్జనని కటాక్షంతో ప్రధాన పంట కాలువల్లోకి నీరు వదులుతున్నారు.



శ్రీశైలం జలాశయం నుంచి విడుదలవుతున్న వరద నీరు

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఆయకట్టు(ఎకరాల్లో) ఇలా..	
గుంటూరు డివిజన్	1.80 లక్షలు
బాపట్ల డివిజన్	3.80 లక్షలు
చీరాల డివిజన్	11,351

తెనాలి: ఎగువ రాష్ట్రాల్లో వర్షాలకు శ్రీశైలం జలాశయం నిండిపోయింది. అధికంగా వస్తున్న వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరో వారం రోజుల్లో నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు నిండుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పులిచింతల దిగువ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్న వరద నీటిని ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణాడెల్టాకు విడుదల చేస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమడెల్టాకు 6,000 క్యూసెక్కులు వస్తోంది.

5,71,351 ఎకరాల ఆయకట్టు

కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో 5,71,351 ఎకరాల ఆయకట్టు ఉంది. గుంటూరు డివిజనులో 1.80 లక్షల ఎకరాలు, బాపట్ల డివిజన్‌లో 3.80 లక్షల ఎకరాలు, చీరాల డివిజన్‌లో 11,351 ఎకరాలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా పండించేది వరి. ఇటీవల వర్షాభావ పరిస్థితులతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు, పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఖాళీ అయ్యాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌కు నీటి లభ్యత ప్రశ్నార్థకమైంది. ఇది రెండు వారాల క్రితం పరిస్థితి. ఆ తర్వాత కురిసిన వర్షాలకు, ఎగువ ప్రాంతమైన తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లో వరి విత్తనాలను వెదజల్లారు. పశ్చిమడెల్టా పరిధిలో ఇప్పటికి కేవలం 1.50 లక్షల ఎకరాల్లోనే వరి సాగు చేపట్టారు. వెదజల్లిన చేలతో పాటు, ఇతర ప్రాంతాల్లో వరినాట్ల కోసం పంట కాల్వలకు నీటి సరఫరా తప్పనిసరైంది.

నాగార్జున సాగర్ స్వరూపం	
జలాశయం సామర్థ్యం	: 312.05 టీఎంసీలు
గురువారం మధ్యాహ్నానికి నీటి నిల్వ	: 161.97 టీఎంసీలు
గరిష్ట నీటిమట్టం అడుగుల్లో	: 590
ప్రస్తుత నీటి మట్టం అడుగుల్లో	: 530.36
ప్రస్తుతం చేరుతున్న వరద నీరు	: 2.16 లక్షల క్యూసెక్కులు

మరో వారంలో నిండుకుండలా సాగర్ !

ప్రస్తుతం ఎగువ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురవటంతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఫలితంగా బుధవారం రాత్రికే శ్రీశైలం జలాశయంలో 883.90 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. వరద ఉద్ధృతి కొనసాగుతూ ఉండటంతో 8 గేట్లను ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ఫలితంగా మొత్తం 2.16 లక్షల క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి చేరుతోంది. వరద కొనసాగుతూనే ఉన్నందున మరో వారంలో సాగర్ జలాశయం కూడా నిండుకుండను తలపించే అవకాశం ఉందని అంచనా.

ఖరీఫ్‌కు 69 టీఎంసీలు అవసరం



వరద ఉద్ధృతి ఆధారంగా నాగార్జున సాగర్ జలాశయానికి గరిష్ట సామర్థ్యానికి మించి నీరు చేరుతుందని అంచనా వేస్తున్నాం. ఇప్పటికే సగానికిపైగా నిండింది. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన 69 టీఎంసీల నీరు లభిస్తుంది. కాల్వ చివరి భూములకూ నీటి సరఫరాకు భరోసా దొరికింది.

– సంకారపు మల్లికార్జున, ఈఈ, కృష్ణాపశ్చిమ డివిజను

పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కులు

ఈ నేపథ్యంలో పులిచింతల దిగువన ప్రకాశం బ్యారేజి క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు వరదనీరు బ్యారేజిని చేరుతోంది. దీంతో కృష్ణాడెల్టాకు సాగు నీటిని విడుదల చేశారు. ఇందులో పశ్చిమ డెల్టాకు గురువారం 6,000 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 2,500 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 650, పశ్చిమ కాల్వకు 250, నిజాంపట్నంకు 400, బ్యాంక్ కెనాల్‌కు 1500, హైలెవల్ చానల్‌కు 200 క్యూసెక్కులు చొప్పున సరఫరా ఇస్తున్నారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ సామర్థ్యం 8,200 క్యూసెక్కులు.

పెన్షన్ల పంపిణీ ప్రారంభం

లబ్ధిదారులతో కలెక్టర్ నాగలక్ష్మి మాటామంతీ




వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంతో వృద్ధులకు కొంత ఆర్థిక సౌలభ్యం లభిస్తుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం ప్రారంభమైన పెన్షన్ల పంపిణీ విధానాన్ని ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 120వ సచివాలయ పరిధిలో కొందరు వృద్ధులకు స్వయంగా పెన్షన్లు అందజేసి వారితో ముచ్చటించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 1న ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీ చేపట్టామని పేర్కొన్నారు. వికలాంగులకు రూ.6,000, వృద్ధులకు రూ.4,000 చొప్పున కలెక్టర్ అందజేశారు. డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జీఎంసీ డీసీలు వెంకట లక్ష్మి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

97.57శాతం పంపిణీ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ గురువారం జిల్లా వ్యాప్తంగా 97.57 శాతం పూర్తయింది. జిల్లాలో 2,57,390 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రభుత్వం రూ.109.57 కోట్లు విడుదల చేసింది. గురువారం సాయంత్రానికి 2,51,131 మందికి సచివాలయ సిబ్బంది రూ.106.91 కోట్లు పంపిణీ చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో గుంటూరు డివిజన్ పరిధిలోని పలు రైళ్లను రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ గురువారం వెల్లడించారు. విజయవాడ-మాచర్ల (07781) రైలును ఈనెల 4 నుంచి 11 వరకు, మాచర్ల-విజయవాడ(07782) రైలును ఈనెల 5 నుంచి 12 వరకు, విజయవాడ-గుంటూరు(07464), గుంటూరు-విజయవాడ(07465) రైళ్లను ఈనెల 5 నుంచి 10 వరకు, నర్సాపూర్-గుంటూరు(07281)ను ఈనెల 4 నుంచి 10 వరకు, గుంటూరు-రేపల్లె(07784), రేపల్లె-గుంటూరు (07785), గుంటూరు-విజయవాడ(07976) రైళ్లను ఈనెల 5 నుంచి 11 వరకు, గుంటూరు-సికింద్రాబాద్(17201), సికింద్రాబాద్-గుంటూరు(17202) రైళ్లను ఈనెల 5 నుంచి 10 వరకు, హుబ్లీ-విజయవాడ(17329) రైలును ఈనెల 4 నుంచి 10 వరకు, విజయవాడ-హుబ్లీ(17330) రైలును ఈనెల 5 నుంచి 11 వరకు, చెన్నై-విజయవాడ(12077), విజయవాడ-చెన్నై(12708) రైళ్లను ఈ నెల 5, 7, 8, 9, 10 తేదీలలో రద్దు చేసినట్లు వివరించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

హైదరాబాద్-తాంబరం(12760) రైలును ఈనెల 2 నుంచి 10 వరకు, సికింద్రాబాద్-తిరుపతి(12764) రైలును ఈనెల 2,4,5,6,8,9 తేదీలలో, సికింద్రాబాద్-గూడూరు(12710) రైలును ఈనెల 2 నుంచి 10 వరకు, ఆదిలాబాద్-తిరుపతి(17406) రైలును ఈనెల 2 నుంచి 10 వరకు పగిడిపల్లి, గుంటూరు, తెనాలి మీదుగా దారి మళ్లించినట్లు వివరించారు. తాంబరం-హైదరాబాద్(12759) రైలును ఈనెల 2 నుంచి 10 వరకు, తిరుపతి-సికింద్రాబాద్ (12763) రైలును ఈనెల 3,5,6,7,9,10 తేదీలలో, గూడూరు-సికింద్రాబాద్(12709) రైలును ఈనెల 3 నుంచి 9 వరకు, తిరుపతి-ఆదిలాబాద్(17405) రైలును ఈనెల 3 నుంచి 9 వరకు తెనాలి, గుంటూరు, పగిడిపల్లి మీదుగా దారి మళ్లించినట్లు వెల్లడించారు.

తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించాలి

కలెక్టర్ నాగలక్ష్మి సూచన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

గుంటూరు వెస్ట్/నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): తల్లిపాల వారోత్సవాల విజయవంతానికి ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో తల్లిపాల విశిష్టతను తెలిపే పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలను బాధ్యతతో నిర్వహించాలని పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్షని, ప్రతి తల్లి వాటి విలువ తెలుసుకునేలా కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో తల్లులు, గర్భిణుల సమావేశం ఏర్పాటు చేసి వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, పీడీ ఎన్‌సీడీ డాక్టర్ శ్రావణ్ బాబు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

- అపుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. పండరీపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం తల్లుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణవేణి, ఏసీడీపీఓ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు



మేడికొండూరు జెడ్పీ హైస్కూల్లో నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లకు ఈనెల 8న ఎన్నికలు జరగనున్నాయి. పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రులకు బాధ్యతలు అప్పగిస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల పేరును ఎస్‌ఎంసీగా మార్చిన ప్రస్తుత ప్రభుత్వం ఈనెల 8న కమిటీలను ఎన్నుకునేందుకు సమగ్రశిక్ష ద్వారా మార్గదర్శకాలు, విధి విధానాలను విడుదల చేసింది.

నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్‌ఎంలు

గుంటూరు జిల్లాలోని 1,067 ప్రభుత్వ పాఠశాలలకు కొత్తగా ఎస్‌ఎంసీలను ఎన్నుకునేందుకు ఆయా పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు గురువారం ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. 810 ప్రాథమిక, 76 ప్రాథమికోన్నత, 181 ఉన్నత పాఠశాలలను కలుపుకుని మొత్తం 1,067 పాఠశాలలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రతి పాఠశాలలో ఒక ఎస్‌ఎంసీ చొప్పున 1,067 పాఠశాలల్లోనూ కొత్తగా ఎస్‌ఎంసీలు కొలువుదీరనున్నాయి. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్‌ఎంలు ఎస్‌ఎంసీలను ఎన్నుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన ఓటర్ల జాబితాను సైతం నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచారు. జాబితాపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈనెల 5వ తేదీ సాయంత్రం లోపు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల దృష్టికి తెచ్చి సరి చేయించుకోవాలి.

పెద్దాస్పత్రిలో చిరుద్యోగులపై చిన్నచూపు

మూడేళ్లుగా ప్రదక్షిణ చేస్తున్నారు..!

మాడుగుల దుర్గారావు గుంటూరు జీజీహెచ్‌లో నాలుగో తరగతి ఉద్యోగి(ఎంఎన్‌ఓ)గా పనిచేస్తూ 2021లో మరణించాడు. ఆయన కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఇప్పటి వరకు అందలేదు. కనీసం కుటుంబ సభ్యులకు ఉద్యోగమూ రాలేదు. ఫలితంగా ఆయన కుటుంబం చితికిపోయింది. ఇప్పటికీ ప్రయోజనాల కోసం ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉంది.

– ఇలా జీజీహెచ్‌లో పనిచేస్తూ చనిపోయిన సుమారు 10 మందికిపైగా నాలుగోతరగతి ఉద్యోగుల కుటుంబాలు ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నాయి. అయినా అధికారులు కనికరించడం లేదు.

- ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారం కోసం నిరీక్షణ
- మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనాలేవీ?
- ఉద్యోగోన్నతులకు ముప్పతిప్పలు
- కారుణ్య నియామకాలకూ ఎదురుచూపులు
- గుంటూరు జీజీహెచ్ కార్యాలయం తీరుపై తీవ్ర విమర్శలు
- పట్టించుకోని ఆస్పత్రి అధికారులు



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఏపీలోనే పేదల పెద్దాస్పత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌లో నాలుగోతరగతి ఉద్యోగులపై ఆస్పత్రి అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. వీరి సమస్యలపై పెద్దలు పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఆస్పత్రి అధికారులకు యూనియన్ల ద్వారా లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా, ధర్నాలు చేసినా ఫలితం లేకుండా ఉంది.

రోగులకు ఎంతో సేవ చేస్తున్నా..

గుంటూరు జీజీహెచ్‌లో రోగికి సహాయకులుగా ఉండి త్వరితగతిన చికిత్స అందేలా చూడటంలో నాలుగో తరగతి ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారు. నడవలేని వారిని వీల్‌చైర్‌లో, స్ట్రెచ్చర్‌లో తీసుకెళ్లడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలకు తీసుకెళ్లడం, మెడికల్ స్టోర్ నుంచి మందులు, సర్జికల్స్ తీసుకు రావటం, ఆపరేషన్ థియేటర్లలో సహాయకులుగా ఉండటం, వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి వైద్య సేవల్లో హెల్పర్లుగా ఉండటం వంటి పనులు చేస్తూ రోగులకు బంధువుల కంటే ఎక్కువగా సేవలు చేస్తున్నారు. ఆస్పత్రిలో అందరి కంటే కిందిస్థాయి పోస్టు కావటంతో వీరి సమస్యలు ఎవరికీ పట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది ఉద్యోగ విరమణ చేసినా, మరణించినా.. వారికి సకాలంలోనే ప్రయోజనాలు వస్తున్నాయి. నాలుగో తరగతి సిబ్బందికి మాత్రం రావడం లేదు. ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి. ఉద్యోగోన్నతులూ దక్కడం లేదు.

వీరి కుటుంబాలకు ఎప్పుడు మోక్షం

నాలుగో తరగతి ఉద్యోగులైన రోజానమ్మ, ప్రసాద్, రాంబాబు, లక్ష్మయ్య, జగదీష్‌బాబు, అచ్చియ్య, సాల్మన్‌రాజు మరికొందరు ఉద్యోగులు చనిపోయారు. వెంకటకృష్ణ, బాబ్జి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. జయలక్ష్మి, లక్ష్మి కొంత మంది ఉద్యోగ విరమణ చేశారు. వీరి కుటుంబ సభ్యులు తమకు ప్రయోజనాలు ఇప్పించాలని, కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది కార్యాలయ ఉద్యోగులు వీరి వద్ద మామూళ్లు తీసుకుని కూడా పనిచేయటం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

పరిపాలన అధికారులు ఉన్నా!

ఆస్పత్రిలో కార్యాలయ పనులపై పర్యవేక్షణ చేసేందుకు అకౌంటెంట్, మేనేజర్, ఏఓ, ఏడీ, అడ్మినిస్ట్రేటర్ ఉన్నారు. వీరందరిపైన సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ, మెడికల్ సూపరింటెండెంట్ ఉన్నారు. డెప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన వ్యక్తిని ప్రభుత్వం జీజీహెచ్‌కు ప్రత్యేకంగా పరిపాలన పరమైన విషయాల కోసం నియమించింది. ఇంత మంది అధికారులు ఉన్నా తమ సమస్యలు పరిష్కారం కావటం లేదని నాలుగో తరగతి ఉద్యోగులు వాపోతున్నారు.

పోరాడుతున్నా.. ఫలితం లేదు



గుంటూరు జీజీహెచ్‌లో నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలపై ఏళ్ల తరబడి యూనియన్ ద్వారా పోరాటాలు చేస్తూనే ఉన్నాం. పలుమార్లు లిఖిత పూర్వకంగా తెలియజేసి ధర్నాలూ చేస్తున్నాం. అయినా ఆస్పత్రి అధికారులకు పట్టడం లేదు. కలెక్టర్ చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

– వడ్డే బాలయ్య, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

దృష్టికి వస్తే పరిష్కారం

ఏడాదిగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నా. నా దృష్టికి వచ్చిన సమస్యలు తక్షణమే పరిష్కరిస్తున్నా. చనిపోయిన నాలుగో తరగతి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు తక్షణమే ప్రయోజనాలు అందించేలా కార్యాలయ అధికారులకు ఆదేశాలు ఇస్తాను.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక

చినగంజాం: రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమం గురువారం ముగిసింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మహిళా, పురుష క్రీడాకారులకు గత నెల 15వ తేదీ నుంచి స్థానిక రామకోటేశ్వరాలయం ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఇరు జట్ల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఇవి నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేటలో ఈ నెల 2, 3, 4వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. జట్లకు క్రీడా దుస్తులను చిల్లర నరసింహారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే గార్డ్ చిల్లర శేషుబాబు, ఆర్పీఎఫ్ సిబ్బంది కుర్రి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి భోగి రెడ్డి స్వామిరెడ్డి, జనసేన నాయకులు నందు శ్రీరాం, ఫిజికల్ డైరెక్టర్ ముంగర సురేష్ బాబు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి పల్లపోలు గోపాలరావు, సౌత్ సెంట్రల్ రైల్వే ఉద్యోగి పోలకం వెంకయ్య నాయుడు, బీచ్ కబడ్డీ ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చెరుకూరి పుల్లయ్య పాల్గొన్నారు.

పురుషుల జట్టు..

ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ టీంలో వై.రాజశేఖర్ రెడ్డి (కెప్టెన్), కోట హరిప్రసాద్ రెడ్డి, గాలి లక్ష్మారెడ్డి, పెళ్లేటి బ్రహ్మారెడ్డి, కుక్కల ప్రసాద్‌రెడ్డి, కుక్కల రామాంజనేయులు రెడ్డి ఉన్నారు. కోచ్‌గా భోగిరెడ్డి స్వామిరెడ్డి, మేనేజరుగా టి.పద్మారావు వ్యవహరిస్తారు.

మహిళల జట్టు..

ప్రకాశం జిల్లా బీచ్ కబడ్డీ మహిళల టీంలో వాయిల అర్చన (కెప్టెన్), కటారి భూమిక, వాయిల అపర్ణ, కోకిల గద్ద నందిని, కుమారి సౌమ్య, కోడూరి త్రిపుర ఉంటారు. ఈ టీంకు కోచ్‌గా పోలకం రామచంద్రరావు, మేనేజరుగా దేవిరెడ్డి, కోచింగ్ మేనేజర్‌గా శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.



ఎంపికైన మహిళా, పురుష జట్లతో ఆర్గనైజింగ్ కమిటీ

జాతీయ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా పురస్కారాలకు ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలతోపాటు విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 99499 29674, 79890 88274 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

లయోలాలో ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



బహుమతి అందుకుంటున్న అండర్-17 విజేతలు బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

గుంటూరు రూరల్: క్రీడాకారులు ఓటమితో కుంగిపోకుండా, ధైర్యంగా నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుంటూ ముందుకు సాగాలని హైదరాబాద్ సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ కమిషనర్, ఆంధ్ర రీజియన్ బాస్కెట్ బాల్ టెక్నికల్ కమిటీ చైర్మన్ జి.సురేష్ బాబు తెలిపారు. గత మూడు రోజులుగా రూరల్ మండలంలోని నల్లపాడు గ్రామంలోగల లయోలా పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రీజినల్ స్థాయి ఐసీఎస్ఈ, ఐఎస్ఈ బాలికల బాస్కెట్ బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ధైర్యంగా ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి, జీవితంలో స్థిరమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.రేవతి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యతోపాటు, క్రీడలు భాగంగా ఉండాలని అప్పుడే విద్యార్థులు శారీరకంగా మానసికంగా బలంగా ఎదుగుతారన్నారు. పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ పాదర్ డాక్టర్ పి.ఆంథోని, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్, ఫాదర్ నరేష్‌లు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. మొత్తం 42 జట్లు పోటీలలో పాల్గొన్నాయన్నారు. ఫైనల్ పోటీల్లో అండర్-14 విభాగంలో హైదరాబాదుకు చెందిన ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ప్రథమ స్థానం, హబ్సిగూడ సెయింట్ జోసఫ్స్ స్కూల్ ద్వితీయ స్థానం, సికింద్రాబాద్‌కు చెందిన షేర్‌వుడ్ పబ్లిక్ స్కూల్ తృతీయ స్థానాన్ని కైవశం చేసుకున్నాయన్నారు. అండర్-17 విభాగంలో హైదరాబాద్ బేగంపేటకు చెందిన ది హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ ప్రథమస్థానం, హైదరాబాద్‌కు చెందిన ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ద్వితీయ స్థానం, ఖైరతాబాద్‌కు చెందిన ఎస్ఎఎస్ఆర్ గరల్స్ స్కూల్ తృతీయ స్థానం సాధించాయన్నారు. అండర్-19 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ప్రథమస్థానం, బేగంపేటకు చెందిన ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానం, మల్లాపూర్‌కు చెందిన జాన్సన్ గ్రామర్ స్కూల్ తృతీయ స్థానంను కై వశం చేసుకున్నాయన్నారు. విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీలు, ఉపాధ్యాయులు, యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.



అండర్-14 విజేతలు హైదరాబాద్ ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్



అండర్-19 విజేతలు..

న్యూస్‌రీల్

రాయితీపై సరుకుల విక్రయానికి స్పందన



బాపట్ల: తక్కువ ధరలకు నిత్యావసర సరకులను అందించేందుకు ఏర్పాటైన ప్రత్యేక కౌంటర్ సత్ఫలితాలు ఇస్తోందని జేసీ బి.సుబ్బారావు తెలిపారు. బాపట్ల రైల్వే స్టేషన్ వద్ద రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. కందిపప్పు కిలో మార్కెట్‌లో రూ.181 ఉండగా, కౌంటర్‌లో రూ.160 కే ఇస్తున్నామని చెప్పారు. బియ్యం కూడా మార్కెట్ ధర కంటే కిలోపై రూ.10 తక్కువకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, డీఎస్ఓ ఇ.బి.విలియమ్స్, సీఎస్‌డీటీ బి.ఓంకార్, తహసీల్దార్ కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

డీఎంహెచ్‌ఓ విజయమ్మ

బాపట్ల: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బాపట్లలోని ఏరియా వైద్యశాలలో ఉన్న తల్లుల వార్డును ఆమె గురువారం పరిశీలించారు. తల్లి పాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ముర్రు పాలను బిడ్డ పుట్టిన వెంటనే తాగించాలని సూచించారు. తల్లి పాలు ఇవ్వటం వల్ల రొమ్ము క్యాన్సర్ రాదని తెలిపారు. ఏడో తేదీ వరకు జిల్లావ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టరు టి.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టరు శేషుకుమార్, డాక్టరు విజయలక్ష్మి, బ్రహ్మం, మరియమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను కోసం వెళ్తుండగా ప్రమాదం

ఇద్దరు వృద్ధులకు తీవ్రగాయాలు



మేదరమెట్ల: వృద్ధాప్య పింఛను తీసుకోవడం కోసం స్కూటీపై వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం కొరిశపాడు జాతీయ రహదారి ఫ్లైఓవర్ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పంగులూరు మండలం కొండమూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రేణంగివరం గ్రామానికి చెందిన రామచంద్రరావు ఒంగోలులో ఉంటున్నారు. గురువారం పింఛన్ కోసం వారి గ్రామాలకు స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో కొరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు



సదస్సులో అమెరికా ప్రతినిధులతో ఆర్‌వీఆర్‌జేసీ నిర్వహణ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: ప్రపంచంలోని అగ్రదేశాల సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తల ద్వారా విశ్వ సాంకేతిక విజ్ఞానాన్ని పరిచయం చేస్తూ నిర్వహించిన ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు 2024 కార్యక్రమానికి తమ కళాశాల సారథ్యంలో నిర్వహించడం అద్భుత అవకాశమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేనిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇటీవల ఆర్‌వీఆర్ జేసీ సారథ్యంలో ఐఈఈఈ, ఐఈఎస్, స్టూడెంట్ అండ్ యంగ్ ప్రొఫెషనల్స్ అంతర్జాతీయ సదస్సు 2024 మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమానికి అమెరికాలోని ఐఈఈఈ, ఐఈఎస్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మిలోస్ మానిక్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆంటోనియో ల్యూక్యూ ముఖ్య అతిథులుగా వివిధ దేశాల నుంచి 92 మంది ప్రతినిధులతో కూడిన బృందం పాల్గొన్నారని తెలిపారు. ఈ సదస్సులో గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీస్, అవకాశాలు, సవాళ్లు, పరిష్కారాలు అనే ప్రధాన అంశంపై, స్మార్ట్ గ్రిడ్, ఇండస్ట్రీ 4.0, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ ఇతర అత్యాధునిక సాంకేతికతలపై నిపుణులు తమ సందేశాలను అందించారని కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పి.త్రిపుర తెలిపారు. అంతర్జాతీయ సదస్సు అగ్రదేశాల ప్రతినిధుల మన్ననలచే విజయవంతంగా నిర్వహించిన కార్యనిర్వాహణ కమిటీ సభ్యులను కళాశాల యాజమాన్యం అభినందించారు. 2030 నాటికి భారతదేశంలో భారీ హరిత శక్తి పరివర్తనే లక్ష్యంగా ప్రధానఅంశంపై ఈ వేదికలో నిర్వహించడం ఆనందదాయకమని తమ కళాశాల ఉత్తమ నివేదికను పరిగణలోకి తీసుకొని ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతో తమ కళాశాల కీర్తి ప్రపంచ స్థాయికి చేరుకుందని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. గతంలో తమ కళాశాల ద్వారా నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు, సభ్యుల ప్రతిభా నైపుణ్యాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయం అమెరికా నుంచి అనేక అవార్డులను, నగదును పొందడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ఐఈఎస్ స్టూడెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయానికి టీడీపీ ఫ్లెక్సీలు



గుంటూరు రూరల్: ప్రభుత్వ కార్యాలయాలను సైతం పార్టీ కార్యాలయాలుగా మార్చేశారు టీడీపీ కూటమి నాయకులు. ప్రభుత్వ కార్యాలయాలకు సైతం పార్టీ ఫ్లెక్సీలను యథేచ్ఛగా కట్టడంపై ప్రజలు విస్తుబోతున్నారు. వెంగళాయపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయంపై మహాత్మా గాంధీ గ్రామ సచివాలయం అని రాసి ఉన్న స్థానంలో బోర్డు కనిపించకుండా పార్టీ ఫ్లెక్సీలను స్థానిక టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. కనీసం సచివాలయ బోర్డు సైతం కనిపించకుండా టీడీపీ ఫ్లెక్సీలు కట్టడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ అడిషనల్ కమిషనర్‌గా సౌమ్య



లక్ష్మీపురం: గుంటూరులోని జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయ అడిషనల్ కమిషనర్‌గా నూతలపాటి సౌమ్య నియమితులయ్యారు. ఈమె విజయవాడలోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై గుంటూరుకు రానున్నారు. గుంటూరు అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.మధుసూదనరెడ్డిని, గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా నియమించారు. జీఎస్టీ, కస్టమ్స్ కేసులకు సంబంధించిన అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయం రాష్ట్రంలో గుంటూరులో మాత్రమే ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5400, మోడల్ ధర రూ.4800 వరకు పలికింది.



మొబైల్ ఫోన్లను జాగ్రత్త చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- 300 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధిత మహిళకు మొబైల్ అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: మొబైల్‌ఫోన్లను జాగ్రత్త చేసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. పోగొట్టుకున్న సుమారు రూ.45 లక్షలు ఖరీదు చేసే వివిధ రకాల 300 ఫోన్లను బాధితులకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్ల పట్ల ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దని చెప్పారు. చాలా మంది స్కూటీల ముందు భాగంలో, సీట్లపైన మొబైల్‌ఫోన్లను ఉంచి మాట్లాడటం చూస్తామని అన్నారు. అది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.3.11 కోట్లు విలువ చేసే 2,076 వివిధ రకాల మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు గుర్తుచేశారు. మొబైల్‌ఫోన్లు పోయిన వెంటనే సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. తద్వారా సెల్ ఫోన్లల్లో నిక్షిప్తమైన సమాచారం దుర్వినియోగంకాదని, సెల్‌ఫోన్ బ్లాక్ అవుతుందని అన్నారు. తద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెంటనే గుర్తించవచ్చునని పేర్కొన్నారు. విలువైన వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి, సోషల్ మీడియా, సైబర్ సెల్ ఇన్‌ఛార్జ్ సీఐ మౌలాషరీఫ్ పాల్గొనగా, ఐటీ కోర్ సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించారు.

మెప్మాలో అక్రమాలపై కొనసాగుతున్న విచారణ



విచారణలో పాల్గొన్న అధికారులు రాజశేఖర్, కీర్తి

పొన్నూరు: పట్టణంలోని మెప్మా పరిధిలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. మెప్మా పీడీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గత పది రోజుల నుంచి చేస్తున్న విచారణలో అక్రమాలపై ఆధారాలు లభించినప్పటికీ బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలయాపనతో ఐదు గ్రూపుల మహిళలు చేసిన ఒక అభియోగంపై చేసిన విచారణ పూర్తయింది. నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని విచారణ అధికారులు రాజశేఖర్, కీర్తి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మరో అంశంపై విచారణ ప్రారంభించారు. పట్టణంలోని ఓ బ్యాంకులో 70 బోగస్ గ్రూపులతో రుణాలు పొందారన్న ఫిర్యాదు మేరకు సంబంధిత బ్యాంకులో రాజశేఖర్, కీర్తి విచారణ చేశారు. అయితే రుణాలకు సంబంధించిన రికార్డులు బ్యాంకు జిల్లా కార్యాలయంలో ఉంటాయని బ్యాంకు సిబ్బంది తెలపడంతో వెనుదిరిగారు.

- నిడుబ్రోలు పరిధిలో ఐదు గ్రూపులకు సంబంధించి పొదుపు సంఘాల సభ్యుల ప్రమేయం లేకుండా స్థానిక మెప్మా సిబ్బంది ఎక్కువ మొత్తంలో రుణాలు పొంది స్వాహా చేశారన్న బాధితుల ఫిర్యాదు మేరకు గత పది రోజుల నుంచి చేసిన విచారణ పూర్తయింది. మెప్మాలో అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. విచారణపై నివేదికను మెప్మా ఎండీ దృష్టికి తీసుకువెళ్లినట్లు అధికారులు తెలిపారు. అయితే విచారణ జరుగుతున్న సమయంలో మెప్మా సీఎంఎం సెలవుపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. విచారణలో తేలిన ఆధారాలతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

గుంటూరు ఆర్డీగా సుచిత్ర



డాక్టర్ సుచిత్రకు అభినందనలు తెలియజేస్తున్న డాక్టర్ శోభరాణి, శ్రీనివాసరెడ్డి, తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులుగా (ఆర్డీ) డాక్టర్ కొల్లాటి సుచిత్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఆర్డీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శోభరాణి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం నర్సాపూర్‌కు చెందిన డాక్టర్ సుచిత్ర తిరుపతిలో ఎంబీబీఎస్, గైనిక్‌లో పీజీ పూర్తి చేశారు. 1992లో పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. ఇబ్రహీంపట్నం మెడికల్ ఆఫీసర్‌గా 11 సంవత్సరాలు పనిచేశారు. నర్సాపూర్ ఎస్పీహెచ్‌ఓగా, డెప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేశారు. ఏలూరు అడిషనల్ డీఎంహెచ్‌ఓగా, డీఎంహెచ్‌ఓగా పనిచేశారు. జిల్లాల విభజనలో భాగంగా మంగళగిరి జీజీహెచ్‌కు రెండేళ్ల క్రితం బదిలీ అయ్యారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా మంగళగిరిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుచిత్రకు అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి ఇచ్చి గుంటూరు ఆర్డీగా పోస్టింగ్ ఇచ్చారు. ఆర్డీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుచిత్రను డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్‌షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు బి.శ్యామ్‌అనిల్ బాబు, సుబ్బారావు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం పరిపాలనా అధికారి ఎం.లక్ష్మణకుమారి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు టి.భక్తవత్సల, డి.సత్యం, సీనియర్ అసిస్టెంట్ బి.కిరణ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు.

30 ఏళ్ల ఆకాంక్ష నెరవేరింది

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు



బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నెహ్రూనగర్: గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి నేడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ముగింపు లభించిందని, తమ ముప్పై ఏళ్ల ఆకాంక్షలను సుప్రీంకోర్టు నెరవేర్చిందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పున హర్షిస్తూ మార్కెట్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ సాధన కోసం ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని.. ఈ తీర్పు వారికి అంకితం చేస్తున్నామని చెప్పారు. వర్గీకరణ సాధనకు సహకరించిన ఎన్‌డీఏ కూటమికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్, కూచిపూడి సత్యం, రాష్ట్ర వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు గాలిముట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీలలోని అన్ని కులాలకు వర్గీకరణతో న్యాయం జరుగుతుందని, 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా వర్గీకరణ సాధించుకోవడం అభినందనీయమన్నారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. సుదీర్ఘ పోరాటంలో పాల్గొన్న నాయకులకు అభినందనలు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మహిళతో సహా ఐదుగురు అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముగ్గురోడ్డు వద్ద నివాసాల మధ్యలో ఉన్న పేకాట స్థావరంపై గురువారం తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక మహిళతో పాటు నలుగురు పురుషులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ముగ్గురోడ్డులో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సీఐ కళ్యాణ్‌రాజు ఆదేశాల మేరకు ఆ ఇంటిపై నిఘా ఏర్పాటు చేసి దాడిచేశామని, ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఒక మహిళతో పాటు నలుగురు పురుషులను అదుపులోకి తీసుకొన్నామన్నారు. వీరివద్ద రూ. 3 వేలు లభించిందని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

మరో పేకాట నిర్వాహకుడికి కౌన్సెలింగ్!

తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న ఓ యువకుడిని తాడేపల్లి పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి, పేకాట నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించి వదిలివేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా అటువంటిది ఏమీలేదని పేకాట నిర్వాహకులపై నిఘా ఏర్పాటు చేసింది వాస్తవమేనని ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని తెలియజేశారు.

చారిత్రక స్థలాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని వారసత్వ కేంద్రాలు, చారిత్రక స్థలాలైన అమరావతి, నాగార్జునకొండ లేపాక్షి, గండికోట, శాలిహుండం, శంకరంలను అభివృద్ధి చేయటానికి నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. గురువారం ఢిల్లీలో కేంద్ర పరావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదు బీర్ సింగ్ రావత్‌కు వినతిపత్రం సమర్పించారు అనంతరం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ రాష్ట్రం లోని చారిత్రక స్థలాలును పరిరక్షించి లేపాక్షి, గండికోట, శాలిహుండం, శంకరం వంటి ప్రదేశాలలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. పర్యాటకులను అధికంగా సందర్శించే ఈ ప్రదేశాలను అభివృద్ధి చేయాలన్నారు.

మూర్తింజాపురంలో 12 మందికి పింఛన్లు నిలిపివేత

సచివాలయంలో లబ్ధిదారుల పడిగాపులు



గ్రామ సచివాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

వినుకొండ(నూజెండ్ల): టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దురుద్దేశపూర్వకంగా తమ పింఛన్లు ఆపివేశారని పింఛన్లను ఇప్పించాలని కోరుతూ మూర్తింజాపురం గ్రామానికి చెందిన 12 మంది పింఛన్ లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో అధికారులను ప్రశ్నించారు. గ్రామానికి చెందిన దేవినేని బాలసుబ్బారావు, మాగులూరి వెంకయ్య, దగ్గుబాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, దేవినేని చంద్రమౌళి, చింతలచెరువు వెంకటనారాయణ, చిన్నబోయిన చినకోటయ్య, చింతలచెరువు బాదుల్లా, బండారు వెంకటేశ్వర్లు, పసుపులేటి వెంకాయమ్మలు పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లగా తమ పింఛన్ ఆగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశామని ఉద్దేశపూర్వకంగా పింఛన్లు ఆపివేశారని, గతంలో ఎంపీడీవో కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీపై ఎలాంటి హామీ రాకపోవడంతో సచివాలయంలో వేచి చూసి వెనుతిరిగి వెళ్లారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణతో చక్కని ఉపాధి

- ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామి
- శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు పొందిన డ్రైవర్లతో డిపో మేనేజర్ వీరాస్వామి

నరసరావుపేట: భారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు కొరత ఉన్నందున ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూలులో చేరి శిక్షణ పూర్తిచేసుకున్న వారికి మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి పేర్కొన్నారు. గురువారం హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై వారికి సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. శిక్షణ పొందిన డ్రైవర్లకు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ప్రమాదాలు జరగకుండా తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఇంధన పొదుపు గురించి తెలియచేశారు. హెవీ లైసెన్స్ కల్గిన డ్రైవర్లకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని, ఆర్టీసీలో కూడా అవకాశాలు వస్తాయని తప్పకుండా తమ వద్ద శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇప్పుడు 17వ బ్యాచ్‌కి ప్రవేశాలు జరుగుతున్నాయని, సీట్లు పరిమితంగా ఉన్నందున లైట్ లైసెన్స్ కల్గి హెవీ లైసెన్స్ పొందగోరు డ్రైవర్‌లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి గాను ఫోన్ నెంబర్లు 73828 96038, 73828 96158, 99592 25428లను సంప్రదించాలని కోరారు.